**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

**ప్రచురణార్థం/ ప్రసారార్థం:** **విజయవాడ,**

**తేది : ఫిబ్రవరి 1, 2017.**

## రాష్ట్రానికి మొండిచేయి చూపిన కేంద్ర బడ్జెట్

పార్లమెంట్‌లో ఈ రోజు ప్రవేశపెట్టిన 2017-18 కేంద్ర బడ్జెట్ రాష్ట్రానికి మొండిచేయి చూపింది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో ఇచ్చిన హామీలు నెరవేర్చే చర్యలు ఇందులో లేవు. రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ, రాష్ట్ర బడ్జెట్‌లోటు పూడ్చడానికి ఇస్తామన్న నిధుల గురించి గానీ ఎటువంటి ప్రస్తావన చేయలేదు. రాజధాని ప్రాంత రైతులకు పన్ను మినహాయింపు, కొన్ని యూనివర్సిటీలకు అరకొర నిధులు కేటాయించడం తప్ప రాష్ట్ర ప్రయోజనాలేమీ నెరవేరలేదు. ప్రత్యేకహెూదా, ప్రత్యేక ప్యాకేజి చట్టబద్ధత గురించి రాష్ట్ర ప్రజల ఆశలపై కేంద్ర బడ్జెట్ నీళ్లు చల్లింది. ఈ బడ్జెట్‌లో రాష్ట్రానికి పెద్దయెత్తున కేటాయింపులు ఉంటాయని తెలుగుదేశం నేతలు చెప్పిన మాటలు ఉత్తుత్తి మాటలుగానే మిగిలిపోయాయి.

ఈ బడ్జెట్‌లో రైతుల ఆదాయాన్ని రాబోయే ఐదేళ్ళలో రెట్టింపు చేస్తామని చెప్పి, మరోవైపున సన్న, చిన్నకారు రైతులన దెబ్బతీసే కాంట్రాక్ట్ ఫార్మింగ్‌కు పిలుపు ఇచ్చారు. రైతులకు ఫసల్‌బీమా యోజన క్రింద కేటాయించే మొత్తాన్ని రూ.13,240 కోట్ల నుండి రూ.9,000 కోట్లకు కుదించారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయడం ద్వారా ఉపాధిని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారు. డీమానిటైజేషన్ వల్ల రైతులు, కూలీలు నష్టపోయిన పరిహారం బడ్జెట్‌లో చోటుచేసుకోలేదు.

టూరిజాన్ని ప్రోత్సహించడానికి పెద్దయెత్తున ప్రైవేటుకు పెద్దపీట వేశారు. ప్రైవేటు వారి నష్టాన్ని పూడించడానికి స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్.పి.వి.) సంస్థను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ రంగ సంస్థల్ని స్టాక్‌మార్కెట్‌లో లిస్టింగ్ చేస్తామని ప్రకటించడం ద్వారా ఈ బడ్జెట్ ప్రైవేటీకరణకు అధిక ప్రాధాన్యతనిస్తుందని స్పష్టమవుతుంది.

డీమానిటైజేషన్ ద్వారా తమకు కొన్ని రాయితీలు, జన్‌ధన్ ఖాతాల్లో జమలాంటివి లభిస్తాయని ఆశించిన ప్రజలు నిరాశకు గురైనారు. ఈ బడ్జెట్ పెద్దలకు పన్ను రాయితీలనిచ్చి ఎక్కువ మందిని పన్ను పరిధిలోకి తీసుకువచ్చింది. కార్పొరేట్లకు గత బడ్జెట్‌లో ఇచ్చిన పన్ను రాయితీలు రూ.76,857 కోట్లను ఈ బడ్జెట్‌లో రూ.83,492 కోట్లకు పెంచారు. పన్ను మినహాయింపు ద్వారా రాయితీ లభిస్తుందని ఆశించిన మధ్యతరగతికి నిరాశను మిగిల్చింది.

నీతిఅయోగ్ పేరుతో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను రద్దుచేసిన ప్రభుత్వం బడ్జెట్‌లో ఆమేరకు కేటాయింపులు చేయలేదు. దేశజనాభాలో 17% ఉన్న ఎస్సీలకు 2.44%, 7%గా ఉన్న గిరిజనులకు 1.48% మాత్రమే కేటాయించడం బిజెపి యొక్క దళిత, గిరిజన వ్యతిరేక వైఖరికి అద్దం పడుతుంది. ఖద్దరును ప్రోత్సహిస్తామంటూ రాట్నం పట్టుకుని ప్రచారం చేసిన మోడీ చేనేతకు గత సంవత్సరం కేటాయించిన రూ.604 కోట్లనుండి రూ.106 కోట్లకు కుదించడంలోనే ప్రభుత్వ చిత్తశుద్ధి అర్థమవుతుంది.

ప్రజల ఎన్నో ఆశల నేపథ్యంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర ప్రజలను, రైతులను, దళితులు, గిరిజనులు, మధ్యతరగతి ప్రజలను నిరుత్సాహపరిచింది. పెద్దలకు రాయితీలు ఇస్తూ సామాన్యులకిచ్చే సబ్సిడీల్లో కోత విధించింది.

**(పెనుమల్లి మధు)**

రాష్ట్ర కార్యదర్శి